క్లుప్తంగా

చివరిరోజు 150 దరఖాస్తులు

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోలేని రైతుల కోసం శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల రైతులు తమ వ్యవసాయ భూముల సమస్యలకు సంబంధించి 150 దరఖాస్తులు సమర్పించారని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయిలో వాటి వివరాలను సరి చూసి దశలవారీగా పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తులతోపాటు కార్యాలయంలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ రవీందర్, ఎంఆర్ఐ వెంకటనర్సయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఇన్‌చార్జి ఏఈ అనిల్‌కుమార్, టెక్నికల్ ఏఈ విష్ణు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఒకే బ్రేకర్ ఉండేదని.. ప్రస్తుతం వ్యవసాయ అవసరాలకు, గ్రామ అవసరాలకు విడివిడిగా బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్తులు సహకరించాలని ఏఈ కోరారు.

వర్షం కురువాలని పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని కొత్తవెంకూర్ గ్రామంలో వర్షాలు కురువాలని కోరుతూ రైతులు, గ్రామస్తులు శనివారం పడమర ముఖ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. నదిజలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని మొతక్‌పల్లి సుద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు శనివారం తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. రాయల్టీ లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఖానాపూర్‌లోనే స్కూల్ ఏర్పాటు చేయాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడెం: నియోజవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఖానాపూర్‌లోనే ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం తహసీల్దార్ ఆర్.ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ సమీపంలోని తిమ్మాపూర్ వద్ద 110 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఖానాపూర్‌లో స్కూల్ ఏర్పాటు చేస్తే ఖానాపూర్, కడెం దస్తురాబాద్, పెంబి మండలాల విద్యార్థులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్‌యాదవ్, మెహన్‌నాయక్, ధర్మపురి తిరుమల్, పూసశ్రీరాం, బుర్రసాయి, రామగిరి రంజిత్, రాజేశ్ తదితరులున్నారు.

మాజీ మంత్రి పరామర్శ



బీరవెల్లిలో పరామర్శిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగపూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. బీరవెల్లిలో ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి తల్లి అనారోగ్యంతో, ధని గ్రామంలో గడ్డం గంగాధర్ కుమారుడు రోడ్డు ప్రమాదంలో, ప్యారమూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు రమణ తల్లి, శ్యామ్‌కుమార్ అమ్మమ్మ మృతి చెందారు. వారి ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అక్కడినుంచి తాండ్ర(జి) గ్రామానికి వెళ్లి అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ నాయకుడు రామారావు, అన్నుసాబ్ కుటుంబాన్ని, కొప్పుల ఆశన్న కుటుంబాలను పరా మర్శించారు. మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సముద్రాల రాజేశ్వర్‌రావు, అయిటి చందు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్, రవి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

యోగాతో ఆరోగ్య భాగ్యం



సారంగపూర్ : జామ్ గురుకులంలో యోగా చేస్తున్న విద్యార్థులు

జిల్లాలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది ఆసనాలు వేసి యోగా సాధనతో కలిగే లాభాలను వివరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ మనసును, బుద్ధిని ఏకం చేసే ఆయుధం యోగా అని.. ప్రతి ఒక్కరూ నిత్యం 40 నిమిషాలు యోగా సాధన చేస్తే ఆరు నెలల్లో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా మారుతారని పేర్కొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



లోకేశ్వరం మండలం రాజూర ప్రాథమిక పాఠశాలలో ప్రాణాయామం చేస్తున్న విద్యార్థులు



నిర్మల్‌రూరల్: సోఫీనగర్ పాఠశాలలో విద్యార్థుల విన్యాసం



కుంటాల: కల్లూరు కేజీబీవీలో ఆకట్టుకున్న ప్రదర్శన



నిర్మల్ బాలికల ఉన్నత పాఠశాలలో..



కుభీర్ ప్రభుత్వ ఆసుపత్రిలో..



నిర్మల్‌లోని డిగ్రీ కళాశాల మైదానంలో ఆసనాలు వేస్తున్న వాకర్లు



ముధోల్ శిశుమందిర్ పాఠశాలలో ఆకట్టుకున్న విన్యాసం



భైంసారూరల్ చుచుంద్ ఉన్నత పాఠశాలలో యోగాసనంలో విద్యార్థులు



దస్తురాబాద్: మున్యాల్ పాఠశాలలో ఆకట్టుకున్న విన్యాసాలు



కడెం : అల్లంపల్లి జీయర్ గురుకులంలో..



తానూరు : ఎల్వి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో..



లక్ష్మణచాందలో ఉపాధి కూలీలతో యోగా చేయిస్తున్న మండల అధికారులు



నర్సాపూర్(జి) కేజీబీవీలో..



భైంసాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో..



మామడ: కొరిటికల్ పాఠశాలలో..



సోన్ : పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో..



ఖానాపూర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో..

వనమహోత్సవం విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- ఇందిరమ్మ ఇళ్లు, సీజనల్ వ్యాధులపై సమీక్ష



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టి మొక్కలను విస్తృతంగా నాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వనమహోత్సవం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల అధికారులు లక్ష్యం మేర మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున అందించాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక స్థలాలను ఎంపిక చేసి గుంతలు తవ్వించి సోమవారంలోగా మొక్కలు నాటించాలన్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈత మొక్కలు నాటాలన్నారు. నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న విరివిగా మొక్కలు నాటాలన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతుందని.. రెండో దశలో 25 శాతం ఇళ్లకు మార్కౌట్ పూర్తయిందని.. వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. వానాకాలం నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కొనసాగించాలని, ఫాగింగ్, లార్వా నిర్మూలన చర్యలతో పాటు ఆసుపత్రుల్లో సరిపడా మందులు, కిట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. గతంలో ఎక్కువ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీపీఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రాజేందర్, ఇన్‌చార్జ్ డీఆర్డీవో నాగవర్ధన్, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, మోహన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలు చిన్నారుల కోసం పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా పని చేస్తున్నందున.. అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి కేంద్రంలో ఆకర్షణీయమైన పెయింటింగ్స్, ఆటబొమ్మలు ఏర్పాటు చేసి పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. పౌష్టికాహారం అందిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో సీడీపీవోలు నాగమణి, నాగలక్ష్మి, సరిత, సమన్వయకర్త నిరంజన్‌రెడ్డి, మండలాల పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



న్యూవెల్మల్‌లో నివాళులర్పిస్తున్న వీడీసీ సభ్యులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ 14వ వర్ధంతి కార్యక్రమాన్ని వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వీడీసీ సభ్యులు, న్యూవెల్మల్ ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటిసారి జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ జిలకర వేణు, రైటర్ బట్టు గంగాధర్, మాజీ సేవా అధ్యక్షుడు పెంట దత్తాత్రి, రొడ్డ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని పలు వార్డులతోపాటు మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నాయకులు ప్రారంభించారు. ఎంఏ మజీద్, చిన్నం సత్యం, దయానంద్, రమేశ్, సంతోశ్, షబ్బీర్‌పాషా, సలీం ఖాన్, రాజన్న, రమేశ్, శ్రీహరి తదితరులున్నారు.

ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని రామ్‌నగర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంసీహెచ్, ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్, సుఖవ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజమౌళి, ఏఎన్ఎం కళ్యాణి, ఎల్లేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ముధోల్: నిబంధనలు పాటించని జిల్లాలోని ప్రయివేటు పాఠశాలల యజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని నేషన్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా విద్యార్థి సంఘం ముధోల్ నాయకులు శశికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయివేటు హాస్టళ్ల నిర్వహణకు అనుమతులు సైతం తీసుకోవడం లేదని ఆరోపించారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

దస్తురాబాద్: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో గంగాధర్, హెచ్ఎం కోట వేణు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పార్‌పెల్లి పాఠశాలలో బాలసభ

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ఉన్నత పాఠశాలలో నెలలో మూడో శనివారం(నో బ్యాగ్ డే) బాలసభ నిర్వహించారు. విద్యార్థులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా మారి గ్రామ సమస్యలను చర్చించారు. హెచ్ఎం మోహన్, ఉపాధ్యాయులు గంగ సురేశ్, రవికుమార్, ఆదిల్, పోశెట్టి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అధ్యాపకుల వినతి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరిందని.. నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ ప్రిన్సిపల్ శ్రీదేవి ఆధ్వర్యంలో అధ్యాపకులు శనివారం ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి విన్నవించారు. సౌకర్యాలు లేక విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని వివరించారు. అధ్యాపకులు బాపు, జాకబ్, తదితరులు ఉన్నారు.

డే కేర్ సెంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో వయోవృద్ధుల కోసం ఒక మల్టీ సర్వీస్ డేకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. జిల్లాలో మల్టీ సర్వీస్ డేకేర్ సెంటర్ నిర్వహణతోపాటు సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడేళ్ల అనుభవం కలిగి డేకేర్ సెంటర్స్, వృద్ధాశ్రమాలు, చిల్డ్రన్స్‌హోం, షెల్టర్ హోమ్స్ నిర్వహించినవారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 21 నుంచి 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు, సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వాహనాలకు ఫిట్‌నెట్ లేకుంటే చర్యలు



ఖానాపూర్‌లో వాహనం తనిఖీ చేస్తున్న ఏఎంవీఐ మర్తుజా అలీ

ఖానాపూర్: ప్రైవేటు వాహనాలకు ఫిట్‌నెట్ లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలు సీజ్ చేస్తామని ఏఎంవీఐ ముర్తుజాఅలీ హెచ్చరించారు. మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులతోపాటు ఇతర ప్రైవేటు వాహనాల ఫిట్‌నెస్‌ను శనివారం తనిఖీ చేశారు. వాహనదారులు అన్నిరకాల ధ్రువపత్రాలు కలిగి ఉండడంతోపాటు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతీ డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్‌తోపాటు వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ వెంట ఉంచుకోవాలని తెలిపారు. తనిఖీలలో ఒక వాహనం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

- ఎస్పీ జానకీ షర్మిల



సన్మానగ్రహీతలతో ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: పోలీస్‌శాఖలో ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి గుర్తింపు దానంతటం అదే వస్తుందని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో లోక్ అదాలత్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీడీఓ, ఏపీపీలకు శనివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్పీ వారిని శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెలలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో వివిధ విభాగాల్లో మూడు వేలకు పైగా కేసులు రాజీ పద్ధతిలో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల పరిష్కారంలో పోలీస్‌శాఖలోని ఐదుగురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ముగ్గురు లైజనింగ్ ఆఫీసర్లు, 27 మంది కోర్ట్ కానిస్టేబుళ్లు ముఖ్య పాత్ర పోషించారని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు అవినాష్, రాజేష్‌మీనా, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, ఆర్ఐలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, లైజనింగ్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మొరాయించిన ప్రగతి రథం



చాక్ పల్లి వద్ద ఆగిపోయిన బస్సు

కుంటాల: ప్రభుత్వ ప్రగతి రథ చక్రాలుగా భావించే ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించింది. కానీ సరిపడా బస్సులు నడపడం లేదు. ఒక్కో బస్సులో 80 నుంచి 120 మంది ప్రయాణిస్తున్నారు. శనివారం నిర్మల్- భైంసా రహదారిపై చాక్‌పల్లి వద్ద బస్సు పంక్చర్ కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పలువురు ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోయారు.

ఆక్రమణలు తొలగింపు

కుభీర్: హైకోర్టు ఉత్తర్వుల మేరకు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మురుగు కాల్వపై అనుమతుల్లేకుండా నిర్మించిన షెడ్ల తొలగింపు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. అధికారులు దగ్గరుండి వ్యాపారులతో మాట్లాడి సామగ్రి తీయించారు. కొందరు స్వచ్ఛందంగా తమ రేకులు ఇతర సామగ్రి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఎంపీవో మోహన్‌సింగ్, ఈవో గౌతం ఉన్నారు.

నిర్మల్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: నిర్మల్ ప్రెస్‌క్లబ్ 2025–27(రెండేళ్లకు)గాను నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాసం శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా బాస లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా రాంపెల్లి నరేందర్, పూసాల పోశెట్టి, యోగేశ్, ఇష్తేకార్ అహ్మద్, కోశాధికారిగా కోడూరు సందీప్, సహ కోశాధికారిగా రాజేశ్వర్, ప్రచార కార్యదర్శిగా అనుముల శివకుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా బొడ్డె వేణుగోపాల్ గౌడ్, కార్యదర్శులుగా బొద్దుల భానుచందర్, మండాజీ మారుతి, కార్యనిర్వహణ కార్యదర్శిగా శ్రీనివాసచారి, సంయుక్త కార్యదర్శిగా ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా జుల్ద మనోజ్, బాతూరి కైలాస్, చందుల సాయన్న, పసుపుల రాజేశ్, మోసిన్ బిన్ మహ్మద్, గౌరవ సభ్యులుగా కొండూరి రవీందర్, శ్రీనివాస్ ,వెంకగారి భూమయ్య, రాం మహేందర్, మహేశ్‌రావు, గుమ్ముల అశోక్, గాజుల రామేశ్వర్, ఎం.ఏ వసీం, ముఖీమ్ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.